క్లుప్తంగా

సీఈని కలిసిన నూతన స్పోర్ట్స్ కౌన్సిల్


సీఈకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సభ్యులు

పాల్వంచ: ఇటీవల నూతనంగా నియామకం అయిన కేటీపీఎస్ 7వ దశ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు శనివారం సీఈ పి.వెంకటేశ్వర రావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్‌గా సీఈ పి.వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా ఎస్ఈ ఎస్.యుగపతి, సెక్రటరీగా ఏఈ టి.మహేశ్, ట్రెజరర్‌గా ఎస్.లెనిన్ కృష్ణ, మహిళా రిప్రజెంటిటీవ్‌గా కె.పద్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎ.శ్రీనివాసరావులు నియామకం కాగా వారు సీఈని కలిశారు. సీఈ మాట్లాడుతూ.. యాజమాన్యం తరఫున క్రీడలకు ఎప్పటి లాగే తగు ప్రాధాన్యం ఉంటుందన్నారు.

మండల స్థాయి అధికారుల సమావేశం


తహసీల్‌లో సమావేశమైన అధికారులు

జూలూరుపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సీజనల్ వ్యాధుల నివారణ, నులి పురుగుల నివారణ దినోత్సవంపై మండల స్థాయి అధికారుల సమావేశం జరిగింది. వర్షాకాలంలో ప్రబలే జ్వరాలు, ఇతర వ్యాధుల నియంత్రణకు పారిశుద్ధ్య పనులు చేపట్టే విధంగా మండల స్థాయి అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. తహసీల్దార్ కె.స్వాతి బిందు, ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ రాకేష్ కుమార్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ తులసీరామ్, డిప్యూటీ తహసీల్దార్ గౌతమ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ


యూనిఫామ్ అందజేస్తున్న దృశ్యం

టేకులపల్లి: టేకులపల్లి ప్రభుత్వ ఉన్న పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్ శనివారం తన పరిధిలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బేతంపూడి, వెంకట్యాతండా, గోలియాతండా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు యూనిఫాం అందజేశారు.

కమ్యూనిటీ హాళ్లను పరిశీలించిన జీఎం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి రామవరంలోని కమ్యూనిటీ హాల్, సీఆర్‌పీ క్యాంపులోని మినీ కమ్యూనిటీ హాళ్లను శనివారం ఏరియా జీఎం ఎం.శాలేంరాజు సందర్శించారు. ఈ సందర్భంగా రామవరంలోని కమ్యూనిటీ హాల్‌లో జరుగుతున్న రూ.25 లక్షల అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. మాట్లాడుతూ... కమ్యూనిటీ హాల్‌లోని పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. అదేవిధంగా పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు రావని, నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం సివిల్ సీహెచ్ రామకృష్ణ, అధికారులు మధుకర్, సివిల్ ఎస్ఈ రాజారాం, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



నేరేడు పండు ఔషధాలు మెండు..

నేరేడు చెట్టు మీద పండ్లు చెట్టు కింద పిల్లలు. ఇది ఒకప్పటి చిత్రం. ఊరిలో, పొలం గట్టు మీద ఉండే నేరేడు చెట్లు నేడు అదృశ్యమైపోయాయి. వానలు మొదలైతే జూన్‌లో నేరేడు పండ్లు వస్తాయి. ఇప్పుడు మార్కెట్‌లో తోపుడు బండ్లపై నల్లగా మెరుస్తూ నిగనిగలాడుతూ నోరూరిస్తున్నాయి. ఈ పండ్ల వలన కలిగే లాభాలు తెలిస్తే ఆ బండి వద్ద ఆగిపోతారు. తప్పక అరకిలో కొని ఇంటికి తీసుకెళ్తారు. అంతే....

- మార్కెట్లో విరివిగా అమ్మకాలు
- ఆరోగ్య ఫలప్రదాయినిగా నేరేడుకు పేరు
- కిలో రూ.200 పైగా పలుకుతున్న ధర


మార్కెట్‌లో తోపుడు బండిపై నేరేడు పండ్లు

చుంచుపల్లి: నల్లగా నిగనిగలాడుతూ వగరు, తీపి, పులుపు మేళవించిన నేరేడు పండ్లు మార్కెట్‌లో అమ్మకానికొచ్చాయి. రుచితో పాటు ఆరోగ్యాన్ని ఇచ్చే వాటిలో నేరేడు పండ్లు ఒకటి. నేరేడును ఔషధ ఫలంగా కూడా పిలుస్తుంటారు. జూన్ ఆరంభంలో ఈ పండ్ల సీజన్ మొదలవుతుంది. వీటిని అల్ల నేరేడు అని కూడా అంటారు. సీజన్‌లో దొరికే ఈ పండ్లను రుచి చూడని వారంటూ ఉండరు. అందుకే మార్కెట్‌లో కనబడగానే వీటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచే కాకుండా స్థానికంగా కూడా అల్ల నేరేడు పండ్లను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. ఇప్పుడిప్పుడే మార్కెట్లోకి వస్తున్న అల్ల నేరేడు పండ్లను వ్యాపారులు కిలో రూ.190 నుంచి రూ.210 వరకు అమ్ముతున్నారు. ప్రకృతి ప్రసాదించే పండ్ల జాతుల్లో ఒకటైన ఆరోగ్య ఫలప్రదాయినిగా పిలిచే అల్ల నేరేడు పండును సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యా నికి సంపూర్ణంగా మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుంది. రుచిలో మేటిగా ఉండే నేరేడు పండు మాత్రమే కాకుండా ఆకులు, చెట్టు బెరడు, గింజలు కూడా శరీరానికి మేలు చేస్తాయి. అల్లనేరేడు పండులో అత్యధిక పోషకాలు ఉన్న నేపథ్యంలో పండు రూపంలోనే కాకుండా ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్ క్రీమ్ తయారీలో పెద్దఎత్తున వాడుతున్నారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్యవిధాన పరంగా అనేక ఔషధ లక్షణాలున్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. ప్రస్తుత సీజన్‌లో రోజుకు రెండు చొప్పున నేరేడు పండ్లు తింటే వ్యాధులు రాకుండా దూరంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

నేరేడుతో ప్రయోజనాలు మెండు..

- నేరేడు పండ్లలో ఐరన్, క్యాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- వ్యాధి నిరోధకశక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుంది. మూత్ర సమస్యల నియంత్రణలో ఎంతో ఉపయోగపడుతుంది.
- ఆకలిని పెంచే గుణంతో పాటు శరీరంలోని పైత్యాన్ని తగ్గిస్తుంది.
- అల్లనేరేడు చెక్క నుంచి తీసిన కషాయం అతిసార, నీళ్ల విరోచనాలు, జ్వరాన్ని తగ్గిస్తుంది. విత్తనాలను ఎండబెట్టి చూర్ణం చేసి తీసుకుంటే మధుమేహం అదుపులో ఉంటుంది.
- కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయం పనితీరును మెరుగు పర్చడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా పనిచేస్తాయి. దంతాలు, చిగుళ్ల ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లో చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు ఎంతగానో దోహదపడుతుంది.
- అన్నివేళల్లో ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా ఇస్తుంది. నేరుడు పండ్లను చెట్టు నుంచి కోయడం చాలా వ్యయంతో కూడుకున్న పనికాబట్టి ధర అధికంగా ఉంటుంది.
- నేరేడు పండ్లు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు సంభవిస్తాయి. వగురు, రుచి కలిగిన నాణ్యత లేని పండ్లను భుజిస్తే గొంతు నొప్పి సంభవించవచ్చు.
- సీజన్ మారే సమయంలో వచ్చే అల్ల నేరేడు పండ్లను మితంగా తినాలి.
- ఉబ్బసం ఉన్నవారు ఈ పండ్లను తక్కువగా తీసుకోవాలి. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది.
- నేరేడు పండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి సంభవించే అవకాశం ఉంది.

సండే స్పెషల్



రాజమండ్రి నుంచి దిగుమతి..



నేరేడు పండ్ల సీజన్ ఇప్పుడిప్పుడే మొదలైంది. వారం రోజులుగా మార్కెట్‌కు వస్తున్నాయి. ప్రతీ జూన్‌లో ఈ వ్యాపారం జోరుగా సాగుతుంది. కొత్తగూడెం మార్కెట్‌కు అల్ల నేరేడు పండ్లను రాజమండ్రి నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ప్రస్తుతం ధర భాగానే పలుకుతోంది. అయినా వినియోగదారులు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు.
– గుత్తుల సాగర్‌కుమార్, పండ్ల వ్యాపారి

అత్యధిక పోషకాలు..



అల్ల నేరుడు పండ్లు ఆరోగ్యానికి ఔషధంగా పనిచేస్తాయి. శరీరంలోని అనేక రుగ్మతలను నివారిస్తాయి. ఐరన్, క్యాల్షియం, పొటాషియం ఎక్కువగా ఉంటుంది. నేరేడుపండ్ల ద్వారా శరీరానికి అధికంగా సీ విటమిన్ లభిస్తుంది. సీజనల్ ఫ్రూట్‌గా పిలవబడే అల్ల నేరేడు మధుమేహ వ్యాధిగ్రస్తులకు చేస్తుంది. వీటిని తినడానికి అందరూ ఇష్టపడుతుంటారు.
– డాక్టర్ ఎ.పుష్పలత, జనరల్ ఫిజీషియన్

విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీని అరికట్టాలి


ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుజాతనగర్: ప్రైవేటు పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో స్టేషనరీ అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలినీ డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో విద్యాశాఖ అధికారి జుంకీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. వంశీ మాట్లాడుతూ... విద్యా సంవత్సరం పునఃప్రారంభమైనందున ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి తక్షణమే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను విద్యార్థులకు అందజేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు ఏఐఎస్ఎఫ్ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ బాలాజీ, వినయ్, నవీన్, పవన్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఏఐఎస్ఎఫ్ నాయకులు పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, పరిశీలించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బాలాజీ, వినయ్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20న వేలంపాట

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో ఈనెల 20న వేలంపాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని ఆదివారపు సంత, తైబజార్ (దినసరి మార్కెట్), కబేళాలు 9 నెలల పాటు నిర్వహించడానికి వేలంపాట నిర్వహిస్తున్నట్లు వివరించారు. మూడింటిలోనూ ఫీజులు వసూళ్లు చేసుకొనుటకు కాంట్రాక్టు పద్ధతిన అప్పగించేందుకు సీల్డ్ టెండర్‌తో పాటు బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు రూ.2500 చెల్లించి, 19న సాయంత్రం 5 గంటలలోపు షెడ్యూల్ పొందాలని తెలిపారు.

కార్మికులకు భద్రత లేకుండా పోయింది..

పాల్వంచ: పదేళ్లుగా నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరించిందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ అన్నారు. స్థానికంగా ఐఎఫ్‌టీయూ పాల్వంచ ఏరియా రెండో మహాసభను బి.మల్సూర్ అధ్యక్షతన నిర్వహించారు. మాట్లాడుతూ.. కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. కనీస వేతనాల కోసం ప్రశ్నించే వీల్లేకుండా పాలన సాగుతోందన్నారు. దేశంలో నిరుద్యోగం, ఆకలి, వెనుకబాటుతనం పెరుగుతోందన్నారు. అనంతరం ఐఎఫ్‌టీయూ పాల్వంచ ఏరియా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేల్పుల రమేశ్, కోశాధికారిగా ఓరుగంటి శ్రీనివాస్, సభ్యుడిగా పగిడిపల్లి సంజీవరావు, గోనెల రమేశ్, బత్తుల ఆంజనేయులు, కుంజా సులోచన, కేసరి వెంకటేశ్వర్లు, సోడే కన్నారావులను ఎన్నుకున్నారు.

కార్యక్రమంలో గోపాలరావు, నూపా భాస్కర్, పూనెం రమేశ్, రాయబారపు వెంకటేశ్వర్లు, వి.పద్మ, నీలం భాస్కర్, తాటి నాగరాజు, కుంజా రమేశ్, కె.భాస్కర్, రామారావు, రామ్ భిక్షం, సూర్యనారాయణ, సుధాకర్, సుశీల, పద్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి జన్మదిన వేడుకలు


ఇల్లెందు: డిప్యూటీ సీఎంకు చిత్రపటం అందజేస్తున్న డాక్టర్ రవి

డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రానున్న కాలంలో భట్టి మరెన్నో పదవులు చేపట్టాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కేక్ కట్ చేసి, నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాయకులు పండ్లు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంరూరల్: కేక్ కట్ చేస్తున్న నాయకులు


పాల్వంచ: మంత్రి పొంగులేటి కార్యాలయం వద్ద


జూలూరుపాడులో...


టేకులపల్లి: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మొక్కలు నాటిన విద్యార్థులు


సుభాష్‌నగర్ హైస్కూల్‌లో మొక్క నాటుతున్న హెచ్ఎం, విద్యార్థులు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ హైస్కూల్ విద్యార్థులు శనివారం ఏకో క్లబ్ ఏర్పాటులో భాగంగా ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఒక్కో విద్యార్థి ఒక మొక్క నాటారు. ఆ మొక్కకు తమ తల్లి పేరుతో బోర్డు పెట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంఉమాశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చల్లసముద్రం హైస్కూల్ ఉపాధ్యాయులు ధనియాలపాడు గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విస్తతంగా ప్రచారం నిర్వహించారు. బడిఈడు పిల్లలందరూ బడిలో చేరాలని తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విత్తన నాణ్యతపై బాధ్యత లేదా?

ఇల్లెందురూరల్: విత్తనం మొలకత్తడంలో ప్రమాణాలు పాటించాలని, అవి మొలకెత్తని పక్షంలో తమకు సంబంధం లేదని వ్యాపారులు సోషల్ మీడియాలో ప్రచారం చేయడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. మండలంలోని కొమరారం కేంద్రంగా రెండు రోజులుగా వ్యాపారుల తీరుపై రైతులు తమ నిరసనను సోసల్ మీడియా వేదికగా తెలుపుతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించి లాభాలను గడిస్తున్న వ్యాపారులు విత్తనం మొలకత్తకపోతే రైతుల పక్షాన కంపెనీల నుంచి పరిహారం ఇప్పించాల్సింది పోయి మా బాధ్యత లేదంటూ ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కొంతమంది వ్యాపారులు కొమరారం ప్రాంత రైతులకు విత్తనాలు విక్రయించడం లేదని, మరికొందరు హామీ పత్రాలు రాయించుకున్న తరువాతే విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా వ్యవసాయశాఖ అధికారులు స్పందించకపోవడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. అధికారులు తక్షణం జోక్యం చేసుకొని విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కార్మిక హక్కుల కోసం ఉద్యమిద్దాం..


మాట్లాడుతున్న కృష్ణ

ఇల్లెందు: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని, సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమాలను తీవ్రతరం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ తెలిపారు. శనివారం ఇల్లెందులో మున్సిపల్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కార్మికచట్టాలను రద్దు చేసే కుట్రలకు తెరలేపాడన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ రంగంలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టి హక్కులు, చట్టాల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లోనూ కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవటం లేదన్నారు. పదేళ్ల సీఎంగా ఉన్న కేసీఆర్ కార్మికులకు న్యాయం చేయలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు తలుపులు తెరిచాయన్నారు. ఈ తరుణంలో కార్మికవర్గం విప్లవ కార్మిక సంఘంలో సమీకృతమై హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటాలు చేయాలని కోరారు. ఈ నెల 23న జరగనున్న ఇఫ్టూ జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.రాంసింగ్, బీఎన్ కాంతారావు, రాములు, వెంకన్న, బాషాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి


విద్యుత్ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న డీఈ నందయ్య

పాల్వంచరూరల్: విధి నిర్వహణలో విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది ప్రమాదాల బారిన పడకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని ఎన్‌పీడీసీఎల్ డీఈ నందయ్య కోరారు. విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా మండలంలోని లక్ష్మీదేవిపల్లి సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించి విద్యుత్ సిబ్బందికి భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది విధినిర్వహణలో హెల్మెట్, చేతి గ్లౌజ్‌లు ధరించి టెస్టర్లు, ఎర్త్‌పైపులు అందుబాటులో ఉంచుకుని పనులు చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ లక్ష్మణ్, ఏఈలు రవీందర్, ప్రతాప్, లైన్‌మెన్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

రైతులకు పంట రుణాలివ్వాలి

టేకులపల్లి: వ్యవసాయానికి పెట్టుబడుల నిమిత్తం బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వాలని బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, టీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం బోడు గ్రామంలోని ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్తగా పోడు పట్టాలు, రెవెన్యూ పట్టాలు పొందిన వారికి వెంటనే రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. నిబంధనలు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల రుణాలు రావడం లేదని, దీంతో రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి.వీరభద్రం, ఎట్టి ప్రసాద్, బి.శివ, మోదుగులగూడెం, బర్లగూడెం రైతులు పాల్గొన్నారు.

మక్క సాగుపై రైతుల ఆసక్తి

- గణనీయంగా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- స్థిరంగా ఉన్న పత్తిసాగు
- మిర్చి సాగు చేయలేమంటున్న రైతులు


అచ్చు తోలుతున్న రైతు, మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న కూలీలు

ఇల్లెందురూరల్: గతేడాది వివిధ పంటలకు ఆశించిన చీడపీడలు.. అతివృష్టి, అనావృష్టి తెచ్చిన ఇబ్బందులు, వెంటాడుతున్న కూలీల కొరత.. తదితర కారణాలతో ఏటా నష్టాలను చవిచూస్తున్న అన్నదాతలు ఈసారి రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు. సాధారణంగా ఇల్లెందు మండలంలో ఇతర పంటల కంటే మొక్కజొన్న సాగు విస్తీర్ణం అధికంగా నమోదవుతోంది. ఇతర పంటలను సాగు చేసిన రైతులు సైతం ఈసారి మొక్కజొన్నసాగుపై దృష్టి సారిస్తుండడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెపుతున్నారు.

30వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు..

అత్యధికంగా వర్షాధారంగా సాగు చేస్తున్న రైతులు నీటి తడులు అంతగా అవసరం లేని మొక్కజొన్న పంట వైపే మొగ్గు చూపుతున్నారు రైతులు. అడపాదడపా కురిసే వర్షాలు మొక్కజొన్న సాగుకు సరిపోతాయి. అవసరమైతే బోర్ల ద్వారా నీటి తడులు అందిస్తుంటారు. ఇక దుక్కులు దున్నడం, విత్తనాలు విత్తుకోవడం, ఎరువులు వేయడం, చీడపీడలు ఆశిస్తే పురుగు మందు పిచికారీ చేయడం మినహా శ్రమ కూడా తక్కువే. ఈ కారణంగా ఎక్కువగా మొక్కజొన్న సాగు చేస్తుంటారు. ఇల్లెందు మండలంలో గతేడాది 25వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇతర పంటలకు ఆశిస్తున్న చీడపీడల కారణంగా వరుసగా నష్టాలు చవిచూస్తున్న రైతులు ఈ దఫా మొక్కజొన్న వైపు చూస్తున్నారు. ఇప్పటి వరకు బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్న విత్తన విక్రయాలను పరిశీలిస్తే సాగు విస్తీర్ణం అధికారికంగా రూ.30వేలు, అనధికారికంగా మరో పదివేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెపుతున్నారు.

స్థిరంగా పత్తి సాగు విస్తీర్ణం...

గతేడాది వర్షాభావ పరిస్థితులు పత్తి పంటపై ప్రభావం చూపాయనే చెప్పాలి. రైతులు ఆశించిన మేర దిగుబడి రాకపోవడం ఈసారి సాగు విస్తీర్ణంపై ప్రభావం చూపొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు పత్తితీత సమయంలో కూలీల కొరత, చీడపీడలు అధికంగా ఆశించడం, అతివృష్టి, అనావృష్టి కారణాలతో ఈసారి స్వల్ప విస్తీర్ణంలో పత్తి రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే పత్తి సాగుకు మండలంలో నేలలు అనుకూలంగా ఉండటం, ఇతర పంటల సాగుకు అవసరమైన నీటి వనరులు అంతగా లేనికారణంగా పత్తి సాగు విస్తీర్ణం గతేడాది మాదిరిగానే 13వేలకు అటూఇటుగా ఉండే అవకాశం ఉందని బహిరంగ మార్కెట్‌లో పత్తి విత్తన విక్రయాలు స్పష్టం చేస్తున్నాయి.

గణనీయంగా తగ్గిన మిర్చి..

రైతులు జూదంలా భావిస్తున్న మిర్చిసాగు రైతులకు గడిచిన రెండేళ్లుగా కన్నీరు పెట్టిస్తోంది. నల్లపురుగు, ఇతర చీడపీడలు ఆశించడంతో మిర్చితోటలు వందల ఎకరాల్లో నేలవాలాయి. పురుగు మందులు ఎంతగా పిచికారీ చేసినా ఫలితం దక్కలేదు. చీడపీడలను ఎదుర్కొని మిర్చి పంటల సాగు కొనసాగించిన రైతులకు కోత సమయంలో కూలీల కొరత చుక్కలు చూపించింది. ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకరావాల్సి రావడం రైతులకు ఇబ్బందిగా మారింది. గతేడాది మండలంలో నాలుగువేల ఎకరాల్లో సాగైన మిర్చి ఈసారి రెండు వేలకు పరిమితమయ్యే అవకాశం ఉందని, అయితే సాగులో శాస్త్రీయ మెళకువలు పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చినట్లు ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మొక్కజొన్న విస్తీర్ణం పెరిగింది...



గతేడాది కంటే ప్రస్తుత సీజన్‌లో మొక్కజొన్న సాగు విస్తీర్ణం నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు పెరిగే అవకాశం ఉంది. విత్తన విక్రయాలు కూడా ఆ మేరకు సాగాయి. పత్తి సాగు గతేడాది మాదిరిగా స్థిరంగా ఉంటుందని అంచనా వేస్తున్నాం. కూలీల కొరత, చీడపీడలు ఆశించడం వల్ల మిర్చి సాగు నుంచి రైతుల మార్పుకు యత్నిస్తున్నారు.
– సతీష్, ఏఓ, ఇల్లెందు మండలం